## మొదటి పాఠం الدرس الأول

### పరలోకం اليوم الآخر

విశ్వాస ఆరు స్తంభాల్లో పరలోక విశ్వాసం ఒక మూల స్తంభం. మానవుడు దివ్య గ్రంథం ఖుర్ఆన్ మరియు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సహీ హదీసుల్లో పరలోకము గురించి తెలుపబడిన రీతిలో విశ్వసించనంత వరకు విశ్వాసి కాజాలడు.

పరలోక విషయాల జ్ఞానం పొందడం, ఎల్లప్పుడూ దాని జ్ఞప్తిలో ఉండుట చాలా ముఖ్యం. ఈ మూలంగా ఆత్మ శుద్ధి, దైవ భీతి మరియు ఇస్లాంపై స్థిరంగా ఉండే భాగ్యం కలుగుతుంది. మనిషిని కఠిన హృదయులుగా మార్చునది మరియు పాపానికి ఒడిగట్టే ధైర్యం ఇచ్చునది ఆ నాటి కష్టాల, బాధల జ్ఞాపకం పట్ల అశ్రద్ధ కంటే మరొకటి లేదు. అల్లాహ్ ఇలా తెలిపాడుః ﴿**ఒకవేళ మీరు కూడా తిరస్కరించినట్లయితే పసివాళ్ళను సయితం పండు ముసలివాళ్ళుగా మార్చివేసే ఆ రోజు నుండి మీరెలా తప్పించుకుంటారు?**﴾. (ముజమ్మిల్ 73: 17). మరో చోట ఇలా తెలిపాడుః ﴿**ఓ ప్రజలారా! మీ ప్రభువుకు భయపడండి. నిశ్చయంగా ప్రళయ సమయాన జరిగే ప్రకంపనం మహా (భీకర) విషయం. ఆనాడు మీరు దాన్ని చూస్తారు... పాలుపట్టే ప్రతి తల్లీ పాలు త్రాగే తన పసికందును మరచిపోతుంది. గర్భవతుల గర్భాలూ పడిపోతాయి. ప్రజలు మైకంలో తూలుతున్నట్లు నీకు కనిపిస్తారు. వాస్తవానికి వారు మైకంలో ఉండరు. అయితే అల్లాహ్ (తరఫున వచ్చిపడిన) విపత్తు అత్యంత తీవ్రంగా ఉంటుంది.**﴾. (హజ్ 22:1,2).

### మరణం الموت

1- ప్రతి జీవికి ఇహలోకములో అది చివరి మెట్టు. అల్లాహ్ ఆదేశం: ﴿**ప్రతి మనిషి చావును చవి చూస్తాడు**﴾. (ఆలె ఇమ్రాన్ 3: 185). మరో చోట ఇలా చెప్పాడు: ﴿**భూమి పై ఉన్నవారందరూ నశింతురు**﴾. (రహ్మాన్ 55: 26). మరో చోట ఇలా చెప్పాడు: ﴿**నీవు చావవలసి ఉన్నది. మరి వారూ చావ వలసి ఉన్నది**﴾. (జుమర్ 39: 30).

ఇహలోకములో ఏ మానవునికీ శాశ్వతం లేదు. అల్లాహ్ ఆదేశం: ﴿**నీకు పూర్వం ఏ మానవుడు శాశ్వతంగా జీవించియుండు నట్లుగా మేము చేయలేదు**﴾. (అంబియా 21: 34).

**చావుకు సంబంధించి కొన్ని ముఖ్య విషయాలు**

1- చావు ఖచ్చితమైన విషయం. అందులో సందేహానికి చోటు లేదు. అయినా అనేక మంది అశ్రద్ధగా ఉన్నారు. కాని ముస్లిం అధికంగా దాన్ని జ్ఞప్తిలో ఉండాలి. దానికి సిద్ధమై ఉండాలి. వృధాగా సమయం దాటక ముందే ఇహలోకంలోనే పరలోక సామాగ్రి తయారు చేసుకోవాలి. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పారుః "ఐదు విషయాలను మరో ఐదు విషయాలకంటే ఎంతో ఉత్తమమైనవని తెలుసుకోః జీవితాన్ని చావు రాక ముందు. ఆరోగ్యమును వ్యాధి, అనా రోగ్యముకు ముందు. తీరికను పనులు మోపు కాక ముందు. యౌవనాన్ని వృద్ధాప్యముకు ముందు మరియు కలిమిని (సిరివంతమును) బీదరికంకు ముందు". (హాకిం, బైహఖీ ఫీ షొఅబిల్ ఈమాన్).

గమనార్హమైన విషయమేమనగాః శవం తన వెంట సమాధిలో ఇహలోక సామాగ్రి తీసుకెళ్ళదు. తన ఆచరణ మట్టుకే తనతో ఉంటుంది. అందుకు సత్కార్యాల సామాగ్రి వెంట తీసుకెళ్ళే ప్రయత్నం చేయు. దాని మూలంగానే నీవు అచ్చట సుఖాలు పొందుతావు. అల్లాహ్ కరుణతో ఆ శిక్షల నుండి రక్షణ కూడా పొందుతావు.